క్లుప్తంగా

రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ నమోదు

నూజెండ్ల: రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ నమోదు కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సుగుణాబేగం అన్నారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఫార్మర్ నమోదు కార్యక్రమం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ 2025-26 నుంచి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలతో పాటు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వడ్డీలేని పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, సూక్ష్మ సేద్య పరికరాలు, ఇతర రాయితీ పథకాలు రైతులు పొందాలంటే ఈయూనిక్ ఐడీ నంబరు ప్రామాణికంగా పరిగణించబడుతుందన్నారు. సొంత భూమి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి ఆన్‌లైన్ నమోదు చేయించాలన్నారు. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌నంబరు వివరాలతో కూడిన ఫార్మర్ రిజిస్టరు పోర్టర్‌లో నమోదు చేసుకుంటే 11 అంకాల విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చునన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



చిలకలూరిపేట: మండలంలోని మురికిపూడి గ్రామం ముదిరాజుపాలెంలో వేంచేసి ఉన్న పరివార దేవతా సహిత శ్రీ కోదండరామస్వామి దేవాలయ పంచమ వార్షిక మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల పదోతేదీ నుంచి ఆలయంలో చేపట్టిన శ్రీరామ నామ సప్తాహ్నిక సంకీర్తన ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అర్చకులు నిమ్మగడ్డ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ భక్త బృందం పాల్గొన్నారు.

కొనసాగిన సినిమా షూటింగ్ సందడి

నాదెండ్ల: గొరిజవోలు గ్రామంలో సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హీరో శొంఠినేని శివాజీ, హీరోయిన్ లయ జంటగా రూపొందుతున్న సినిమా షూటింగ్ ఐదు రోజుల పాటు గ్రామంలో జరగనుంది. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు షూటింగ్ స్పాట్‌కు విచ్చేసి నటీనటులను అభినందించారు. హీరో శివాజీ తన స్వగ్రామంలో సినిమా షూటింగ్ జరపటంపై ఆయన్ను, యూనిట్ సిబ్బందిని అభినందించారు. కుటుంబ కథా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాలో హీరో శివాజీ నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి పాత్ర పోషిస్తున్నారు. గతేడాది ఆగస్టులో ప్రారంభమైన సినిమా షూటింగ్ ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తి కానుందని డైరెక్టర్ సుధీర్ శ్రీరామ్ తెలిపారు. సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్, కెమెరామెన్‌గా రిత్విక్‌రెడ్డి పనిచేస్తున్నారు. తొలిరోజు గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల్లో హీరో శివాజీ, విలన్ రఘుకుమార్‌లపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం



శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం ఐసీడీఎస్ వారి సారథ్యంలో బాల్య వివాహం-బాలల హక్కులకు అవరోధం కల్గిసే టోల్‌ఫ్రీ నంబరు సమాచారం కల్గియున్న ఫ్లెక్సీను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు బాలలకు వారి బాల్యాన్ని అందించాలని, బాధలను కాదన్నారు. బాల్య వివాహాలు చేయటం చట్టారీత్యా నేరమన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఏపీయం వాసుబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో డిజటల్ సేవలు

ఈపూరు(శావల్యాపురం): యూనియన్ బ్యాంకు సారథ్యంలో త్వరలో డిజటల్ సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు ఈపూరు యూనియన్ బ్యాంకు మేనేజరు ముక్కంటి పార్థసారధి అన్నారు. సోమవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు రుణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈపూరులో గత 45 సంవత్సరాల నుంచి యూనియన్ బ్యాంకును ఏర్పాటు చేసి ఖాతాదారులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు మరింత సౌకర్యం కోసం నూతన భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. రూ.178 కోట్లు ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని ఏటీయం సెంటరు, డిపాజిట్ నగదు మిషన్, లాకర్ సౌకర్యం కూడా త్వరలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. 380 మహిళా సంఘాలు గ్రూపులకు రూ. 40 కోట్లు రుణాలతో పాటు సకాలంలో చెల్లింపులు చేసిన సభ్యులకు వ్యక్తిగత రుణాలను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు చందన, సుకుమార్ ఉన్నారు.

లోకోస్ యాప్‌లో సమగ్ర సమాచారం

- ఏపీఎం కె.రవీంద్రకుమార్
- వీవోఏలకు లోకోస్ యాప్‌పై రెండు రోజులు శిక్షణ



లోకోస్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీఎం కె.రవీంద్రకుమార్

యడ్లపాడు: స్వయం సహాయక సంఘాల సభ్యుల సమగ్ర సమాచారాన్ని డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని వెలుగు ఏపీఎం కె.రవీంద్రకుమార్ చెప్పారు. కేంద్రం ఆదేశాల మేరకు యానిమేటర్లకు అవసరమైన లోకోస్ యాప్ (ప్రజా నిర్వహణ ఆపరేట్ సిస్టం) రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల వివరాలు, సభ్యుల ఆర్థిక, సామాజిక, సాంకేతిక తదితర సమాచారాలను ఈ యాప్‌నందు నమోదు చేయడం జరుగుతుందన్నా రు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని సంఘాల్లోని సభ్యుల సమగ్ర వివరాలు, వారి ఆర్థిక లావాదేవీల సమాచారం నిక్షిప్తమై పూర్తి పారదర్శకంగా ఉంటుందన్నారు. మహిళలు ఈ యాప్‌ద్వారా తాము చెల్లించే వాయిదాలు, తీసుకుంటున్న రుణాల వివరాలు ఎప్పటికప్పుడు చూసుకునే వీలుందన్నారు. మండల పరిధిలో 1348 సంఘాలు ఉండగా ఇప్పటికే 1330 సంఘాల సభ్యుల వ్యక్తిగత సమాచారం నమోదు చేయడం జరిగిందన్నారు. ఇంకా 202 గ్రూపులు వివిధ కారణాలతో పెండింగ్ ఉన్నాయని, వీటిలో 774 మంది వివరాలను సేకరించాల్సి ఉందన్నారు. మార్చి నెలాఖరు నాటికి పూర్తి గ్రూపుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసి, వచ్చే ఆర్థిక ఏడాది నుంచి రుణాలు మంజూరు, జీవనోపాధుల కల్పన వంటి కార్యక్రమాలు ఈ యాప్ ద్వారానే చేయాల్సి ఉంటుందని వివరించారు. యడ్లపాడు మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్.నాగలక్ష్మి అధ్యక్షతన కొనసాగిన ఈ శిక్షణలో 39 గ్రామైక్య సంఘాలకు చెందిన 38 మంది యానిమేటర్లు (వీవోఏ)లు, లీగల్ కోఆర్డినేటర్ షేక్ నాగుల్ మీరావలి, సీసీలు పాల్గొన్నారు.

అంగన్వాడీల మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చండి

కోర్కెలు తీర్చాలంటూ సీడీపీవోకు వినతి పత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు



సీడీపీవో ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న మహిళా నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను వెంటనే తీర్చాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రంలో సీడీపీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, గ్రాడ్యూటీ చెల్లించాలని, రాష్ట్రంలో ఉన్న మినీ సెంటర్లు అన్నింటినీ మెయిన్‌సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్‌కు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలు చేయాలని, సంక్షేమ నిధులు అంగన్వాడీలకు అమలు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి మట్టిఖర్చులకు రూ.20 వేలు చెల్లించాలంటూ పలు కోర్కెలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి, ప్రాజెక్ట్ కార్యదర్శి ఎస్.గోవిందమ్మ, మాధవి, కె.వినీల పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



బొల్లాపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రేమిడిచర్ల, రావులాపురం గ్రామాల మధ్య సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగులపాలెం గ్రామానికి చెందిన ఆళ్ల వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేముల వెళ్తుండగా మార్గమధ్యంలో రావులాపురం, రేమిడిచర్ల గ్రామాల మధ్య ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం మేరకు 108 వాహనం సంఘటనా ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రుడిని వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కస్టమర్ కేర్, డేటా ఎంట్రీ కోర్సులకు దరఖాస్తులు

క్రోసూరు: క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కస్టమర్ కేర్ డొమెస్టిక్ వాయిస్ కోర్సు, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణనిస్తున్నట్లు జిల్లా నెపుణ్యాధికారి అధికారి జి.తమ్మాజీరావు సోమవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదవ తరగతి ఆపైన చదువుకున్న (18-45 వయస్సు) నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కోర్సులో చేరదలిచిన వారు మార్క్స్ సర్టిఫికెట్ జిరాక్స్‌లు, బయోడేటా, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాలేజీలో అందజేయాలని కోరారు. వివరాలకు అంజిరెడ్డి 7779858789ని అడిగి తెలుసుకోవాలన్నారు. 50 రోజుల పాటు జరిగే శిక్షణ కాలం పూర్తిచేసుకున్న వెంటనే సర్టిఫికెట్ తోపాటు ఉపాధి కల్పించబడుతుందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పోరాటాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పలు కార్యక్రమాలు నిర్ణయించడం జరిగిందన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కె.మల్లికార్జున, శ్రీనివాస్, అబ్రహాం రాజు, సాయిబాబు, పచ్చిగొర్ల ఏసు, ఏసుపాదం పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

- వైద్యశాల వద్ద ఉద్రిక్తత
- అడిషనల్ ఎస్పీ హామీతో సద్దుమణిగిన వివాదం



మృతదేహం వద్ద విలపిస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు

నరసరావుపేట టౌన్: వైద్యం వికటించి ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. అతని మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటూ మృతుడి బంధువులు వైద్యశాల ఎదుట మృతదేహంతో సోమవారం ఆందోళనకు దిగారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వి.సుధాకర్, లక్ష్మీ దంపతుల కుమారుడు విక్రమ ఆదిత్య (6)ను వినికిడి సమస్యతో సత్తెనపల్లి రోడ్‌లోని ఓ ప్రైవేటు వైద్యాశాలలో ఆదివారం ఉదయం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. సర్జరీకి ముందు బాలుడు బాగానే ఉన్నాడని అన్ని రకాల పరీక్షలు, స్కానింగ్‌లు నిర్వహించి అంతా బాగుందని ఆసుపత్రి వర్గాలు చెప్పినట్లు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేస్తామని చెప్పి తమ వద్ద రూ.లక్ష యాభై వేలు డిమాండ్ చేసి చివరకు రూ.50 వేల రూపాయలు కట్టించుకుని కనీసం రసీదు కూడా ఇవ్వలేదని వాపోయారు . సర్జరీ అనంతరం మధ్యాహ్నం రెండున్నర గంటలకు సర్జరీ సక్సెస్ అని బాలుడు మత్తులో ఉన్నాడని చెప్పినట్లు తెలిపారు. నాలుగు గంటల నుండి ప్రతి అరగంటకు ఒకసారి బాలుడికి ఫిట్స్ వచ్చాయని, జ్వరం వచ్చిందని, హార్ట్ స్ట్రోక్ వచ్చిందని రకరకాలుగా చెబుతూ మభ్యపెడుతూ సాయంత్రం ఏడు గంటలకు బాలుడు మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు చెప్పినట్లు తెలిపారు. బాలుడి మృతి విషయం తెలుసుకున్న బంధువులు సోమవారం వైద్యాశాల వద్దకు చేరుకున్నారు. మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి నిర్లక్ష్యంగా వైద్యం చేసి బాలుడు మృతికి కారణమైన డాక్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ సంతోష్ అక్కడికి చేరుకుని మృతుడి బంధువులతో చర్చించారు. జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకొని వెళ్లారు.

చిట్‌ఫండ్ మేనేజర్‌పై చర్యలు తీసుకోండి

జిల్లా రిజిస్ట్రార్‌కు ప్రజా సంఘాల వినతి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: చిట్‌ఫండ్ వ్యాపారం పేరుతో ప్రజల ఆస్తులు కొల్లగొడుతూ మోసం చేస్తున్న ధనలక్ష్మి శ్రీనివాసన్ చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు మీడియాతో మాట్లాడుతూ మేనేజర్ శ్రీనివాసరావు అమాయక ప్రజలను చిట్‌ఫండ్‌లో చిట్‌దారులుగా చేరితే అప్పులు ఇస్తామని నమ్మబలికి, చేరిన వారిచేత ఖాళీ ప్రోనోట్లు, డాక్యుమెంట్లు, చెక్‌బుక్‌లపై సంతకాలు చేయించుకుని అప్పులు ఇచ్చి దానికి అధిక వడ్డీలు వసూలు చేస్తూ వారి ఆస్తులు కొల్లగొడుతున్నారన్నారు. పేరుకే చిట్‌ఫండ్ వ్యాపారమని, మిగతాదంతా వడ్డీ వ్యాపారంతో నిలువునా దోచుకోవడమే అన్నారు. ఇటీవల కాలంలో నరసరావుపేట పట్టణంలో అనేక ప్రైవేట్ చిట్ ఫండ్ సంస్థలు ప్రజల సొమ్ము దోచుకొని మోసం చేస్తున్నారని, అదే కోవలో ఇతను కూడా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే వీటి లైసెన్సులు రద్దుచేసి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా రిజిస్టర్ స్పందించి తగు విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని అన్నారు. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటనాయక్, న్యాయవాది యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పై ఆసక్తి చూపాలి

తహసీల్దారు కె.సుజాత



కూరగాయలు తీసుకుంటున్న తహసీల్దారు సుజాత

శావల్యాపురం: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరు చేయాలని తహసీల్దారు కె.సుజాత సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కూరగాయలు ఆకుకూరలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల అవశేషాలు వినియోగించిన ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. విషరహిత ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలన్నారు. ఆవు పేడతో సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేసినవన్నీ తినటం ద్వారా ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. మండలంలోని కారుమంచి, మతకుమల్లి గ్రామాల్లో సాగు చేసిన కూరగాయాలు, ఆకుకూరలు పండించినవన్నీ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వినుకొండ ప్రకృతి వ్యవసాయం పర్యవేక్షణ అధికారి వన్నెపు తిరుపతిరావు, పరిమి సుధారాణి, వయ్యకంటి పావని, రాజావరపు నాగమల్లేశ్వరి, వీఆర్వో నరసింగరావులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి సేవాశ్రమ వార్షికోత్సవం



బాబా వారికి ప్రత్యేక పూజల్లో భక్తులు

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా సేవాశ్రమం 15వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయాన్నే బాబాను ప్రత్యేకంగా అలంకరించి కాగడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. విరాట్ సాయి స్తోత్రం పఠించారు. అనంతరం బాబాకు చందనోత్సవం , మధ్యాహ్నం హారతి, సాయంత్రం 3 గంటలకు బాబాకు గ్రామోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు. ఈపూరు సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, భజనలు నిర్వహించారు. వార్షికోత్సవ కేక్‌లను కట్ చేశారు. అన్నదానం నిర్వహించారు. రాత్రి సంధ్యాహారతి నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు యావీ శివరామయ్య, కార్యదర్శి శిఖాకొల్లి పాపారావు, ట్రస్టీ ఎం.సామ్రాజ్యం, సభ్యులు పర్యవేక్షించారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

ఎస్‌ఐ నాగేంద్రరావు



ద్విచక్ర వాహనాలదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగేంద్రరావు

క్రోసూరు: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పక హెల్మెట్ ధరించండి, ప్రాణాలు కాపాడుకోండి అని ఎస్‌ఐ నాగేంద్రరరావు సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ప్రాణాపాయ ప్రమాదాల నుంచి హెల్మెట్ కాపాడుతుందని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం, మద్యం తాగి నడపటం, మైనర్లు వాహనాలు నడపటం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపటం కారణంగా ప్రమాదాలు జరిగి తల రోడ్డుకు తగిలి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్న విషయం అందరికీ తెలుసునన్నారు. కావున ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తెలియజేశారు. రవాణా చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే అధిక జరిమానా విధించటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్ధలింగమూర్తి



మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ లింగమూర్తి

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పీడీ లింగమూర్తి ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం, సరాసరి వేతనం, గోకుల షెడ్లు, శ్రమశక్తి సంఘాలు, గృహ నిర్మాణాలకు 90 రోజుల పని దినాలు, ఉద్యానవన పంటలు, లేబర్ బడ్జెట్‌పై అంశాల వారీగా సమీక్ష చేశారు. సమావేశంలో సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి, రాజుపాలెం ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, నకరికల్లు ఎంపీడీవో కాశయ్య, సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ ఇన్‌చార్జ్ పొత్తూరి వెంకటనారాయణ, నియోజకవర్గంలోని ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

నార్నెపాడు(ముప్పాళ్ల): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం పరిశీలించారు. ఎంత మేర సర్వే పూర్తయిందో రికార్డులు పరిశీలించారు. సర్వే జరుగుతున్న భూమికి సంబంధించి రైతులతో మాట్లాడి, ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే జరిగే ప్రాంతంపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. రైతులు కూడా భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టి.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

బర్డ్ ఫ్లూతో భయం భయం

- విపరీతంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధి
- వ్యాధి సోకిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృత్యువాత
- మనుషులకూ వ్యాప్తి చెందుతుందంటున్న నిపుణులు
- చికెన్ ప్రియులు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



బర్డ్ ఫ్లూ భయంతో ఖాళీగా ఉన్న ఓ కోళ్ల ఫారం

నకరికల్లు: నిన్నటివరకు ఆరోగ్యంగా గెంతులేస్తున్న కోళ్లు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతున్నాయి. ఏమవుతుందో తెలుసుకునే లోపే టపాటపా రాలిపోతున్నాయి. కోడి మేత మేయకుండా మెత్తగా కన్పించడం తెల్లవారే సరికి మృతి చెందడం.. ఇది ప్రస్తుత పరిస్థితి.. దీనిని వైద్య పరిభాషలో బర్డ్ ఫ్లూ వ్యాధిగా పరిగణిస్తున్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృతి చెందడంతో పాటు పక్కన ఉన్న కోళ్లకు సైతం సోకుతుంది. బర్డ్ ఫ్లూ సోకిన 10 కిలోమీటర్ల పరిధి వరకు ఈ వైరస్ వ్యాపిస్తుంది. కోళ్లకే కాదు మనుషులకూ ఈ వ్యాధి సోకే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. దీంతో కోళ్ల పెంపకందారులు అలాగే చికెన్ ప్రియుల్లో ఆందోళన ఆవహించింది.

వ్యాధి లక్షణాలు ఇలా...

బర్డ్ ఫ్లూ అనేది అంటు సంబంధిత వ్యాధి. ఇది సాధారణంగా కోళ్లలో వ్యాప్తి చెందుతుంది. ఒక కోడి నుంచి మరొక కోడికి క్షణాల్లో వ్యాప్తి చెంది ప్రాణాలను హరిస్తుంది. ఈ వైరస్ 10 కిలోమీటర్ల పరిధిలో వ్యాప్తి చెందుతుంది. సాధారణంగా గాలిలో మార్పు ద్వారా ఈ వ్యాధి వస్తుంది. తీవ్ర జ్వరంతో నీరసించి పోయి మేత మేయకుండా కోళ్లు కన్పిస్తాయి. వ్యాధి లక్షణాలు కన్పించిన కొద్ది గంటల వ్యవధిలోనే మృత్యువాత పడతాయి. ఒక కోడికి వ్యాధి లక్షణాలు కన్పిస్తే పక్క కోళ్లకు 90 శాతం పైగా వ్యాధి సోకే ప్రమాదముంది. మిగిలిన వాటిని కూడా తొలగించడం మంచిది.

మనుషులకూ సోకే అవకాశం

గాలి ద్వారా వ్యాప్తి చెందే బర్డ్ ఫ్లూ వ్యాధిని జూరోటిక్ డిసీజ్‌గా చెబుతారు. కోళ్లలో మాదిరిగానే మనుషుల్లో ఈ వ్యాధి సోకితే అవే లక్షణాలు కన్పిస్తాయి. తీవ్రమైన జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. సకాలంలో వైద్యం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యాధి సోకిన కోళ్లను కోయడం ద్వారా వ్యాధి మరింత వేగంగా వ్యాప్తి చెందుతుంది. బర్డ్ ఫ్లూకు నివారణే శ్రేయస్కరమైన మార్గం.

తగ్గిన చికెన్ ధరలు

బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ ధరలు భారీగా తగ్గిపోయాయి. గత ఐదారు రోజుల క్రితం వరకు రూ.230-240 వరకు పలికిన స్కిన్‌లెస్ చికెన్ ధరలు ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయాయి. ఆది, సోమవారాల్లో రూ.130-140కు విక్రయిస్తున్నారు. ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఉన్న కోళ్లను ఎంతో అంతకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు చికెన్ వ్యాపారులు ధరలు తగ్గించి ఆకర్షిస్తున్నారు.

పశుగణన సర్వే పనులు వేగవంతం చేయాలి



సర్వే పనులు పరిశీలిస్తున్న పశువైద్యాధికారి గుణధీర

శావల్యాపురం: జాతీయ పశు గణాంక సర్వే పనులు తుది దశకు చేరినట్లు పశువైద్యాధికారి సోముల గుణధీర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గుణధీర్ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో పశుగణన సర్వే పనులు 90 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. మార్చి నెలాఖారులోగా నూరుశాతం సర్వేకు పాడిపోషకులు తప్పనిసరిగా పాల్గొని తమవంతు సహకారం అందించాలన్నారు. సర్వే చేసిన సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శావల్యాపురంలో జరుగుతున్న సర్వే పనులు పరిశీలించి పాడిరైతులకు ఈసర్వే వలన జరుగు ప్రయోజనాలు వివరించారు.